
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

శుక్రవారం 23 ఆగస్టు 2024

5



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా


కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

- లోక్‌సభ ఎన్నికల్లో నైతికంగా ఓడిన బీజేపీ
- హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణకు జేపీసీ వేయాలి
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

7

అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు దేశాన్ని అప్పగించి ప్రధాని మోదీ ఊడిగం చేస్తున్నాడని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో పూర్తిస్థాయి మెజారిటీ రాకున్నా.. మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేశారని అన్నారు. హనుమకొండలోని హరితహోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్న ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ



కేసముద్రం మండలంలో పత్తిలో గుంటుకు తోలుతున్న రైతు (ఫైల్)

హలధారి నిరీక్షణ

పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు

- వానాకాలంలో రైతు భరోసా అనుమానమే..!?
- ఇంకా ఖరారు కాని పథకం విధివిధానాలు
- రుణమాఫీపై రాష్ట్రప్రభుత్వం ముందుకు..

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 22 : రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వానాకాలం కర్షకులకు పెట్టుబడి సాయం అందడం అనుమానంగానే కనిపిస్తోంది. రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరించాలని మంత్రివర్గం ఉప సంఘాన్ని వేసి మార్గదర్శకాలు, విధివిధానాలు రూపొందించాలని రాష్ట్ర సర్కార్ అనుకున్నప్పటికీ.. వివిధ జిల్లాల్లో సదస్సులు నిర్వహించినప్పటికి మేధావుల అభిప్రాయాలను సేకరించడం ఇంకా పూర్తి కాకపోవడంతో కాలయాపన అవుతుందే తప్ప.. మార్గదర్శకాలు, విధి విధానాలు రూపుదిద్దుకోవడంలో ఆలస్యం అవుతున్నది. రూ.2 లక్షల రుణమాఫీ చేయడంలో సర్కారు నిమగ్నమై ఉండడంతో.. రైతుభరోసా అందడంలో కాలాయాపన జరుగుతోంది. వానాకాలంలో వానలు ఊపందుకుని, వరినాట్లు కూడా ముమ్మరంగా సాగుతూ.. అనుకున్న లక్ష్యానికి చేరుతున్నప్పటికి పెట్టుబడి సాయం కోసం కర్షకులు ఎదురు చూస్తున్నారు.

గత ప్రభుత్వ హయంలో..

రైతుల పంట పెట్టుబడుల కోసం బయట నుంచి అప్పులు తీసుకువచ్చి వ్యవసాయం చేస్తున్నారని. వాటిని తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచించి విత్తనాలు, ఎరువుల కొనుగోళ్ల కోసం రైతుబంధు పథకం ప్రవేశపెట్టింది. అంతేకాకుండా రైతులు ఏదైన కారణం చేతనైనా మరణిస్తే వారి కుటుంబాలు వీధిన పడకుండా ఉండేందుకు రూ.5 లక్షలు వచ్చే విధంగా రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఎకరాకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు వెరసి రూ.10 వేలు పెట్టుబడి సాయం కింద రైతులకు అందించేవారు. ఈ పథకం రైతులకు మంచిదే అయినప్పటికి వ్యవసాయం చేయనివాళ్లకు, పడావ్ పడ్డ భూములకు, రాళ్ల, రప్పలు, గుట్టలు ఉన్న వారికి, క్వారీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, రహదారుల కిందపోయిన భూములకు సైతం రైతుబంధు పెట్టుబడి సాయం ఇచ్చారు. వందలాది ఎకరాల ఆసాములకు కూడా డబ్బులు ఇవ్వడంతో రైతు బంధు పథకం విమర్శలపాలైంది.



నెల్లికుదురు మండలంలో వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు పథకాన్ని రైతు భరోసాగా మారుస్తూ పక్కా వ్యవసాయం (పంటలు పండించే) చేసే భూములకే రైతుభరోసా ఇస్తామని, ఈ గుట్టలు, రాళ్ల, రప్పలు, వ్యవసాయం చేయని బీడు భూములకు ఇవ్వబోమని, పదేకరాలకు పైన ఉన్న భూములకు రైతుభరోసా ప్రకటించింది. అయితే రైతులు, మేధావుల నుంచి అభిప్రాయ సేకరణ చేసి రైతు భరోసాపై మార్గదర్శకాలు, విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించారు. అందులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సభ్యులుగా వేశారు. దాంతో ఆ మంత్రివర్గ ఉపసంఘం వేసి జూలై 15లోపు ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు. మంత్రివర్గ ఉప సంఘం రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా కేంద్రాలలో రైతు సదస్సులను ఏర్పాటు చేసి, అభిప్రాయ సేకరణ తీసుకుంటున్నారు. దాంతో ఆ సదస్సులలో 10 ఎకరాల లోపే రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, పంటలు వేసిన రైతులకే ఆ పథకం వర్తింప చేయాలని మెజార్టీ రైతులు ఆ సదస్సుల్లో అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అయితే ఇంకా మేధావుల నుంచి కూడా అభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంది. దీంతో విధివిధానాలు, మార్గదర్శకాలను ఇంకా తయారు చేయలేదు.

రుణమాఫీతో రైతుభరోసాకు ఆటంకం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద ఏడాదికి రూ.10 వేలు ఇవ్వగా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. మహబూబాబాద్ జిల్లాలో 2023-24 యాసంగిలో 2,14,685 మంది రైతులకు రూ.233.07 కోట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం పెరిగిన ఈ రైతుభరోసాలో మరో కొంతమంది కొత్తరైతులు పెరిగే అవకాశం ఉంది. దాంతో పెట్టుబడి సాయం మరో రూ.100 కోట్లకు పైగా పెరిగే అవకాశం ఉంది. రూ.2 లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి మొదటి విడతగా రూ.లక్ష మాఫీచేసి, రెండో విడతలో రూ.లక్షన్నర మాఫీ చేశారు. ఈ ఆగస్టు 15లోపు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని తీవ్ర ప్రయత్నంలో ఉన్నారు. రైతు రుణమాఫీకి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోనే.. రైతు భరోసాకు ఆటంకం ఏర్పడి ఒక్క అడుగు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. దాంతో రైతుభరోసా పెట్టుబడి సాయం విడుదల చేయడంలో ఆలస్యమవుతుందని పలు రైతులు అంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బ్యాంకులో రుణం తీసుకోని రైతులు మాత్రం రైతు భరోసా పెట్టుబడి సాయం కోసమే ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చేరువ తీసుకొని వెంటనే పెట్టుబడి సాయం అందచేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక



- ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన
- రచయితలు, కళాకారులు, ఉన్నతాధికారులతో సమావేశం
- చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న జిష్ణుదేవ్‌వర్మ
- జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆయా జిల్లాల కలెక్టర్లు

వివరాలు 7లో..

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సురేష్

చిన్నగూడూరు, ఆగస్టు 22 : పోలీస్ విధుల్లో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని తొర్రూర్ డీఎస్పీ సురేష్ సూచించారు. గురువారం మండల పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని అన్నారు. 100 డయల్ చేస్తే వెంటనే స్పందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ సీఐ రాజ్‌కుమార్ గౌడ్, ఎస్సై ఝాన్సీ, నరేష్, సోమన్న ఉన్నారు.



మానుకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ శ్రేణులు

రైతు ద్రోహి కాంగ్రెస్ ప్రభుత్వం

- బేషరతుగా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్
- రైతుల లోన్లు మాఫీ చేయాలని ధర్నాలు

వివరాలు 8లో..

భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దాం : జడ్పీ సీఈవో



మొక్కను నాటుతున్న జడ్పీ సీఈవో నర్మద

తొర్రూరు రూరల్, ఆగస్టు 22 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, రానున్న తరాలకు బంగారు బాటలు వేయాలని జడ్పీ సీఈవో నర్మద అన్నారు. గురువారం అమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరుమీద' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి కాలుష్య నియంత్రణకు ప్రజలు సహకరించాలని, మొక్కలతోనే మానవాళి మనుగడ అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షించడంలో బాధ్యత వహించాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో అందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులందరూ బాగా చది వి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎంపీడీవో వేణుమాదవ్, హెచ్‌ఎం మంజుల, ఈజీఎస్ ఈసీ బిందు, పంచాయతీ కార్యదర్శి శ్రావణి పాల్గొన్నారు.



నెల్లికుదురులో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట క్యూలైన్‌లో చెప్పులు పెట్టిన రైతులు



నెల్లికుదురులోని బ్యాంకు ఎదుట క్యూలో ఉన్న రైతులు

బ్యాంకు ఎదుట బారులు

- నెల్లికుదురులో రుణమాఫీ దరఖాస్తులు సమర్పించడానికి భారీగా వచ్చిన రైతులు
- ఎండకు తట్టుకోలేక ఎస్‌బీఐ ముందు క్యులైన్‌లో చెప్పులు పెట్టిన కర్షకులు
- అధికారుల తీరుపై అన్నదాతల ఆగ్రహం

నెల్లికుదురు, ఆగస్టు 22 : బ్యాంకులు అన్నదాతలతో రద్దీగా మారాయి. రైతులతో కిటకిటలాడాయి. రూ.2 లక్షల రుణ మాఫీ లబ్ధిదారులు బ్యాంక్‌లో ధ్రువీకరణ పత్రాలు అందజేయడానికి నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట గురువారం కర్షకులు భారీగా బారులు తీరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడుతలుగా రుణమాఫీ చేయడంతో ఆయా రైతులు తమ పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డులు, సంబంధిత డ్యాకుమెంట్లు బ్యాంకులో సమర్పించి, రినివల్ చేసుకోవడానికి అధికంగా తరలివచ్చారు. అలాగే రుణమాఫీ అయిందా! లేదా? తెలుసుకోవడానికి, డబ్బులు డ్రా చేసుకోవడానికి నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఒకేసారి బ్యాంక్ వద్దకు చేరుకోవడంతో రద్దీగా మారింది. దీంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. ఒకరికొకరు ఘర్షణకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు అక్కడకు చేరుకొని, రైతులను సమన్వయపరిచి, క్యూలైన్ ఏర్పాటు చేసి దరఖాస్తులు చేసుకోవడానికి సహకరించారు. బ్యాంక్ అధికారులకు భోజన విరామ సమయంలో రైతులు ఎండకు తట్టుకోలేక తమచెప్పులను క్యూలైన్‌పెట్టి పడిగాపులు కాశారు. అయితే బ్యాంక్ అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాల వారిగా దరఖాస్తులు చేసుకోవాలని సమాచారం ఇవ్వకపోవడంతో బ్యాంక్ ఎదుట రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది కర్షకులు మాత్రమే దరఖాస్తులను బ్యాంక్ అధికారులకు అందచేశారు. మరికొందరు బ్యాంక్ సమయం ముగియడంతో అసంతృప్తితో వెనుదిరిగి పోయారు.

కార్మికుల పనితీరు అభినందనీయం

- తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి

తొర్రూరు, ఆగస్టు 22 : రాఖీ పండుగ సందర్భంగా కార్మికులు ఎంతో కష్టపడి పనిచేసి డిపో అభివృద్ధికి కృషి చేశారని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి అన్నారు. గురువారం బస్టాండ్ ఆవరణలో కార్మికులకు కష్టపడి పనిచేసిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 3రోజుల పాటు డిపో పరిధిలో వివిధ రూట్‌లలో బస్సులు నడపగా డిపోకు రూ.19 లక్షల మేర అదనపు ఆదాయం వచ్చిందన్నారు. రోజువారి ఆదాయం రూ.12లక్షలు కాకుండా అదనపు ఆదాయం రావడం కార్మికుల కృషి అన్నారు. రీజియన్ పరిధిలో వంద శాతం ఓఆర్ సాధించిన ఘనత తొర్రూరు డిపోకే దక్కిందన్నారు. కష్టపడి పనిచేసిన కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో కంటే కార్మికులు అత్యధికంగా ఆదాయాన్ని సాధించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, ఆర్టీసీ అధికారులు, కార్మికులు తదితరులు ఉన్నారు.



కార్మికులకు బహుమతులు అందిస్తున్న పద్మావతి

రుణమాఫీ కాని రైతులు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 22: వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న రుణ మాఫీ గ్రీవెన్స్‌సెల్‌ను గురువారం పరిశీలించారు. పలువురు రైతుల నుంచి రుణ మాఫీకి సంబంధించిన ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ సాంకేతిక కారణాలతో ఆధార్‌లో పేరు, బ్యాంక్ అకౌంట్‌లో తేడాలు ఉంటే వెంటనే సరిచేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఇతర సమస్యలతో రుణమాఫీ కానీ అర్హులైన వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యవసాయాధికారులతో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) ఎ.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డితో పాటు వ్యవసాయశాఖ అధికారులు, ఏఈవోలు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లోని రైతు వేదికలో రుణమాఫీ గ్రీవెన్స్‌ను పరిశీలిస్తున్న విజయనిర్మల

బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయాధికారి..

మహబూబాబాద్ జిల్లా వ్యవసాయాధికారిగా ఎం.విజయనిర్మల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అభిమన్యుడు నుంచి చార్జ్ తీసుకున్నారు. మహబూబాబాద్ ఏడీఏ శ్రీ నివాసరావు, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి మరియన్నతో పాటు వ్యవసాయాధికారులు, కార్యాలయ సిబ్బంది విజయనిర్మలను వేర్వేరుగా శాలువాలతో సత్కరించారు.

వ్యవసాయశాఖ అధికారులకు రైతు శ్రేయస్సే లక్ష్యం..

మరిపెడ : వ్యవసాయశాఖ అధికారులు రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల అన్నారు. ఆమె మరిపెడలోని ఎంఏవో, ఏడీఏ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం డీఏవో స్థానిక వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం జరిపి మాట్లాడారు. ఏఈవోలు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ పంటల సేద్యంపై తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాలపై తనిఖీలు పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఆమెవెంట మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర, ఏవో వీరాసింగ్, పలు గ్రామాల ఏఈవోలు ఉన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

డోర్నకల్, ఆగస్టు 22 : ప్రతీ ఒక్కరు తమతమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, కమిషనర్ నరేష్‌రెడ్డి అన్నారు. గురువారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని 13వ వార్డులో దోమల నివారణ కోసం ఫాగింగ్, క్రిమి సంహారిక మందులను పిచికారి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని, అలాగే ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జగ్రత్తలను వివరించారు. నీరు నిల్వఉన్న చోట కిరోసిన్ లేదా ఆయిల్ బాల్స్ వేసుకోవాలన్నారు. మురికి నీటికాల్వల్లో చెత్తను వేయొద్దని, ఇంటిముందుకు వచ్చే మునిసిపల్ వాహనంలో చెత్తను వేయాలన్నారు. కౌన్సిలర్ జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఉన్నారు.



డోర్నకల్ 13వ వార్డులో క్రిమిసంహారక మందు స్ప్రే చేయిస్తున్న కమిషనర్, మునిసిపల్ చైర్మన్

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

బయ్యారం, ఆగస్టు 22 : గుడుంబా స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించి, ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం. జగ్నాతండాలో తెల్లవారుజామున సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 12 లీటర్ల గుడుంబాను స్వాధీనపరుచుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న బీక్యాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దుబ్బతండా, భీముడు తండాలో..

తొర్రూరు రూరల్ : గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారీ చేసిన, బెల్లం విక్రయాలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.ఉపేందర్ హెచ్చరించారు. దుబ్బతండా, భీముడు తండాల్లో అక్రమంగా గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏఎస్సై ప్రభాకర్ రెడ్డి, కానిస్టేబుళ్లు తిరుమలేష్, శ్రీనివాస్, శ్రీలత, తారాచంద్ పాల్గొన్నారు

వ్యవసాయ శాఖలో
అధికారుల బదిలీలు

బాలసముద్రం, ఆగస్టు22: హనుమకొండ జిల్లా వ్యవసాయశాఖలో అధికారులు బదిలీ అయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశాలతో మల్టీజోన్-1పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాలో పని చేస్తున్న అధికారులకు సాధారణ బదిలీలు అయినట్లు తెలిపారు. ఎం.లక్ష్మీనారాయణ మహబూబాబాద్ నుంచి హనుమకొండ ఏడీఏగా, హనుమకొండ ఏడీఏగా పని చేసిన కె.దామోదర్‌రెడ్డి నర్సంపేటకు బదిలీ అయ్యారు. అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోలుగా అఫ్జల్‌పాషా, భీమదేవరపల్లి నుంచి హనుమకొండకు బదిలీ కాగా, బి.మాధవి హనుమకొండ నుంచి దుగ్గొండికి బదిలీ అయ్యారు. కాజీపేట ఏవోగా పని చేసిన శ్రీధర్‌రెడ్డి హనుమకొండ అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోగా వచ్చారు. భీమదేవరపల్లి ఏవోగా రాజేష్, నూతన మండలం వేలేరు ఏవోగా లలిత, ఐనవోలు ఏవోగా సీహెచ్. సునీల్‌కుమార్, నడికూడ ఏవోగా పోరిక జైసింగ్, దామెర ఏవోగా రాకేష్‌లు బదిలీలపై వచ్చినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరంగల్, హనుమకొండ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా జి.సంగీత నల్లగొండ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. వరంగల్ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా పని చేసిన శ్రీనివాసరావు కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా హార్టికల్చర్ అధికారిగా చెరల రాకేష్ తొర్రూర్ నుంచి బదిలీపై వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22: ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 30లోపు చెల్లించాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు మీసేవ, టీఎస్ఆన్‌లైన్ తదతర కేంద్రాల ద్వారా ఫీజు చ్లెలంచాలని తెలిపారు. ఆగస్టు 30 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, సెప్టెంబర్ 4 వరకు రూ. 25 అపరాధ రుసుముతో, సెప్టెంబర్ 9 వరకు రూ. 50 అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేటి నుంచి సెమీ డీలక్స్ ఆర్టీసీ సర్వీసులు

బాలసముద్రం, ఆగస్టు 22: వరంగల్ రీజియన్ పరిధిలో సెమీ డీలక్స్ ఆర్టీసీ బస్సు సర్వీసులను శుక్రవారం నుంచి నూతనంగా నడుపనున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి భూపాలపల్లి, ఏటూరునాగారం, కాళేశ్వరం రూట్లలో సెమీ డీలక్స్ బస్సు సర్వీసులను నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190, హనుమకొండ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ రూ.100, సెమీ డీలక్స్ రూ.110, డీలక్స్ రూ.110, హనుమకొండ నుంచి కాళేశ్వరం ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190 కాగా, బస్సు ప్రయాణం చేసిన ప్రతీ ఒక్కరు టికెట్ తీసుకోవలసి ఉంటుందన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

● జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం ● తెలంగాణలో సీపీఐకి ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
● సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ● ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, ఆదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ఆరోపించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణసమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మోదీ విధానాలను తూర్పారబట్టారు. మోదీ అండదండలతో కార్పొరేట్ శక్తులు దేశాన్ని నిలువునా దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసేలా ఉందన్నారు. సామాన్యుల ఆశలు, ఆకాంక్షలు ఆ బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రతిఫలించలేదని అన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, తదితర కీలక రంగాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించే ఏ చర్యను బడ్జెట్‌లో ప్రతిపాదించలేదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య అంతకంతకూ పెరిగిపోతోందని, పరిష్కారానికి మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రూపాయి విలువ దారుణంగా పతనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదానీ, అంబానీ అక్రమాలపై విచారణ జరపాలని డి.రాజా డిమాండ్ చేశారు. ఆదానీ గ్రూపులో సెబీ ఛైర్మన్ విదేశాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టారంటూ హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, దీనిపై విచారణకు జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) వేయాలని రాజా డిమాండ్ చేశారు. హిండెన్ బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెబీ ఛైర్మన్‌తో రాజీనామా చేయించాలన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించింది గెలుపుకాదని, ప్రజల ఆ పార్టీని నైతికంగా ఓడించం ద్వారా తగిన గుణపాఠం చెప్పారన్నారు. 400 స్థానాలతో అధికారంలోకి వస్తామని ఎన్నికల ప్రచార సభల్లో పదేపదే చెప్పిన మోదీ. 250లోపు సీట్లకే పరిమిత మయ్యారన్నారు. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు ఊతకర్రల సాయంతో కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటైందని, ఈ ఇద్దరి మద్దతు ఎంతకాలం ఉంటుందనేది పెద్ద ప్రశ్న అని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారిందని మోదీ చెబుతున్నా. ప్రజలకు రేషన్ ఉచితంగా ఇచ్చే పరిస్థితి ఇంకా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఇప్పటికీ దేశంలోని నిరుపేదల్లో చాలా మందికి రేషన్‌కార్డులు లేవని, ఇది దేశ వ్యాప్త సమస్య అని, వారందరికీ కార్డులు ఇచ్చే దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

పశ్చిమ బెంగాల్‌లో ఒక మెడికో విద్యార్థినిపై అత్యాచార సంఘటనపై దేశవ్యాప్తంగా అట్టుడుకుతున్నా..మోదీ మౌనం వీడడం లేదని రాజా పేర్కొన్నారు. దేశంలో మహిళలపై దాడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. వైద్యవృత్తిలో కొనసాగుతున్నవారికి రక్షణ కోసం ఒక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌ను మోదీ అంగీకరించడం లేదని రాజా ఆరోపించారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేస్తోందని, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తోందన్నారు. మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ఈ భావనకు తూట్లు పొడుస్తూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక విధానాలకు భిన్నంగా ఒకే దేశం.. ఒకే ఎన్నిక, ఒకే దేశం.. ఒకే మతం వంటి నినాదాలతో మోదీ ప్రభుత్వం విచ్ఛినకర పాలనను సాగించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బ్యూరోక్రసీలోకి ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను జొప్పించే ప్రయత్నం మోదీ చేస్తున్నారని, ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందన్న ఆవేదన ఆయన వ్యక్తం చేశారు.

రాజ్యాంగం స్థానంలో కొత్త మతతత్వ రాజ్యాంగాన్ని తేవడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయని రాజా అన్నారు. నిత్యం రామజపం చేసే బీజేపీకి రాముడు జన్మించిన ప్రదేశంలోనే ప్రజలు ఓటుతో ఓడించి బుద్ధి చెప్పారన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాల పట్ల జమ్మూ కశ్మీర్ ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అక్కడ శాంతి భద్రతలను కాపాడేందుకే చర్యలు తీసుకున్నామని గొప్పగా చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఉగ్రవాదుల మారణకాండ కొనసాగుతూనే ఉందన్నారు. జమ్మూకశ్మీర్, హరియాణాలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖామన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర, జర్ఖండ్ రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని రాజా జోస్యం చెప్పారు. కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంలో మోదీ దారుణంగా విఫలమయ్యారని విమర్శించారు. వినేష్ పొగట్ ఒలంపిక్‌లో గోల్డ్‌మెడల్ తెచ్చేవారని, బీజేపీ అనుసరించిన విధానాల వల్లే పతకం జేజారిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, మతతత్వ విధానాలను అడ్డుకునేందుకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఒక్కటికావాలని రాజా పిలుపు నిచ్చారు. ఇటీవలి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు, సీట్లను పెంచుకోవడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా నిలబడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తానని చెప్పి జాప్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై కొద్దినెలలే అయినందువల్ల వేచిచూస్తున్నామన్నారు.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సృష్టించిన సంక్షోభం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం బయటపడలేకపోతోందన్నారు. రుణమాఫీ వంద శాతం అమలు కాలేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకోవద్దని కోరుకుంటున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగని పక్షంలో పోరాటం చేస్తామని కూనంనేని వెల్లడించారు. బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, బీజేపీని నిలువరించడంతో పాటు సీపీఐ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు తమ పార్టీ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఐని మరింత బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై కౌన్సిల్ నిర్మాణ సమావేశంలో లోతుగా చర్చించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కౌన్సిల్ నిర్మాణ సమావేశాలను పూర్తి చేసుకున్నామన్నారు. డిసెంబర్ 25నాటికి సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఒక క్రియాశీల, మిలిటెంట్ పార్టీగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందని చెప్పారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, సీపీఐ నాయకుడు అజీజ్‌పాషా, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డి.రాజా సమావేశాల ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రకార్యవర్గం సమావేశమైంది. వివిధ అంశాలపై చర్చించింది.


హనుమకొండలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నాయకులు

అట్టహాసంగా సీపీఐ సమావేశాలు ప్రారంభం

హాజరైన సీపీఐ జాతీయ నేతలు డి.రాజా, చాడ వెంకట్‌రెడ్డి, నారాయణ
విడతల వారీగా సమావేశాలు నిర్వహించిన నేతలు

బాలసముద్రం, ఆగస్టు 22: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలపై ప్రస్తుత రాజకీయాలు, పార్టీ బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు హరిత హోటల్‌కు చేరుకున్న జాతీయ నాయకులకు జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా సీపీఐ జెండాను రాష్ట్ర నాయకులతో కలిసి ఎగురవేశారు. అనంతరం హరితహోటల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్వర్యంలో మొదటగా రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యు లు 11 మందితో, సమావేశం నిర్వహించారు. తరువాత 31 మంది ఎగ్జిక్యూటీవ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం 137 మంది స్టేట్ కౌన్సిల్ మెంబర్‌లతో జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు నారాయణ, చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని పార్టీ నిర్ణయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

ప్రజాసమస్యలపై ఉద్యమిస్తేనే పార్టీ బలోపేతం

నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమించినప్పుడే కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో గురువారం సీపీఐ పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో తొలిరోజు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవల వివిధ రాష్ట్రాలలో మరణించిన సీపీఐ నాయకులు, వామపక్ష ప్రజాస్వామ్యవాదుల చిత్రపటాలకు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పార్టీ నాయకులకు వివరించారు. ఈనేపథ్యంలో పెట్టుబడిదారీ శక్తులకు దీటుగా కమ్యునిస్టులు పని చేయాలని అన్నారు. అట్టడుగు వర్గాలను చైతన్యవంతులను చేయాలని కమ్యూనిస్టు నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్ల వెంకటరెడ్డి, తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, కలవేని శంకర్, బీఎస్ బోస్, బాల మల్లేశ్, బాల నరసింహాలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన సీపీఐ నాయకులు

సీపీఐ నేతలను కలిసిన వినయభాస్కర్


డి.రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వినయభాస్కర్

బాలసముద్రం, ఆగస్టు 22: హనుమకొండ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, జాతీయ కార్యదర్శులు చాడా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావులను హనుమకొండలోని హరిత హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలకు హాజరైన జాతీయ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్కడికి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ హాజరై జాతీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ హనుమకొండలో చాలాసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు జాతీ య నాయకులకు కూనంనేని సాంబశివరావు పరిచ యం చేశారు. అనంతరం వినయ్ భాస్కర్‌తో ఎమ్మెల్యే కూనంనేని సరదాగా మాట్లాడుతూ.. మీరు చేసుకున్న అపకారమే మీ ఓటమికి కారణాలని అనగా.. వినయ్‌భాస్కర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కాగా సీపీఐ జాతీయ నాయకులను వినయ్ భాస్కర్ కలవడంపై పలువురు ఆసక్తిగా చర్చించుకున్నారు.

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక

ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన

వరంగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 27, 28, 29 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. తన పర్యటనలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు ఓరుగల్లులోని అనేక చరిత్రాత్మక కట్టడాలు, లక్నవరం సరస్సును సందర్శించనున్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులతో పాటు కవులు, కళాకారులు, రచయితలతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. అలాగే పలువురిని సన్మానించనున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

● 27వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు గవర్నర్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 8గంటలకు భువనగిరి జిల్లాలోని యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకుంటున్నారు. అక్కడ స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం 8.45లకు రోడ్డు మార్గాన బయలుదేరి ములుగు జిల్లా కలెక్టరేట్‌కు 11.30గంటలకు చేరుకుంటారు. 12గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 1గంటకు ఉన్నతాధికారులతో పరిచయం కార్యక్రమం ఉంటుంది. అప్పటి నుంచి 3గంటల వరకు రచయితలు, ఆర్టిస్టులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన వారితో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని గణపేశ్వరాలయంను సైతం గవర్నర్ సందర్శించనున్నారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్దకు సాయంత్రం 6.30గంటలకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

● 28వ తేదీ బుధవారం ఉదయం లక్నవరం అందాలను ఆస్వాదిస్తారు. ఆపై ఉదయం 8గంటలకు లక్నవరం నుంచి బయలుదేరి 9.15గంటలకు హనుమకొండలోని నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 9.45వరకు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 10గంటలకు హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేరుకుంటారు. 11.05గంటల నుంచి 12.05గంటల వరకు ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. మధ్యాహ్నం 12.15గంటల నుంచి 2.30గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందినవారితో గవర్నర్ పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఖిలావరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయం, భద్రాకాళి దేవాలయం, పద్మాక్షి గుడితోపాటు నగరంలోని ఇతర ముఖ్యమైన ప్రదేశాలను గవర్నర్ సందర్శిస్తారు. సాయంత్రం 6.40గంటలకు నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు.

● 29వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జనగామ జిల్లాకు బయలుదేరి వెళతారు. 10 గంటలకు జనగామ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ఉ.11.15గంటల వరకు అధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.35గంటలకు ఒబుళాకేశ్వాపూర్ గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందినవారితో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.10గంటలకు ఒబుళాకేశ్వాపూర్ నుంచి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రోడ్డు మార్గాన బయలుదేరి భువనగిరి జిల్లా కొలనుపాకు వెళ్లనున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజుల గవర్నర్ పర్యటన ముగుస్తుంది. కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా కలెక్టర్లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

నీటి పారుదల శాఖ అధికారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

బాలసముద్రం, ఆగస్టు 22: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడాదిలోపు సాగునీటి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కాల్వల పనులను పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. గురువారం చింతగట్టులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఈసందర్భంగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాదుల ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. జనగామ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడకుండా గోదావరి జలాలను పంటలకు అందించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ధర్మసాగర్ సౌత్ కెనాల్, నవాబ్‌పేట మెయిన్ కెనాల్, అశ్వరావుపేట రిజర్వాయర్, నష్కల్ నుంచి పాలకుర్తితో పాటు గండి రామారం రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూటరీ కాల్వలలో పేరుకుపోయిన పూడిక, జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఇతరత్రా పనులను గుర్తించి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి 15 రోజుల్లోగా సమగ్రమైన నివేదిక అందించాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సీఈ అశోక్, వరంగల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జనగామ ఎస్ఈ సుధీర్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

● నకిలీ ప్రెస్, సీబీఐ, కార్డులతో మోసాలు ● రూ.1కోటి 34లక్షలు టోకరా ● వివరాలు వెల్లడించిన సుబేదారీ సీఐ సత్యనారాయణ

బాలసముద్రం, ఆగస్టు 22: వివిధ రాష్ట్రాలలో నకిలీ ప్రెస్‌కార్డులు, సీబీఐ కార్డులు చూపించి ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను గురువారం సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నిమిత్ కెపాసి (అలియాస్) అమిత్‌కుమార్ (47), సమన్ కాపాసి (అలియస్)కాసోజు జయ(42) ఇద్దరూ కలిసి వివిధ కంపెనీలలో పెట్టుబడి పేరుతో ఇతర రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడ్డారు. అమిత్ కుమార్ 2023లో హనుమకొండ జూలైవాడకు చెందిన సయ్యద్ రియాజ్, ప్రవీణ్ కుమార్‌లను పరిచయం చేసుకొని వారికి తన కంపెనీలో ఉద్యోగం ఇచ్చాడు. అదే విధంగా మరికొంత మంది యువకులను నియమించుకుని వారి అకౌంట్ నెంబర్లకు అమిత్‌కుమార్ సెల్ నంబర్ జత చేసి సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. తన కంపెనీ సిబ్బంది వసూలు చేసిన డబ్బులను వారి అకౌంట్‌లో వేసుకుంటే అమిత్‌కుమార్ అకౌంట్‌కు డబ్బులు వచ్చే విధంగా మార్చుకుని అమాయకులను మోసం చేశాడు.


సుబేదారి పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

వరంగల్, హైదరాబాద్, పూణే, విశాఖపట్నం నగరాలలో పలు కంపెనీలైన స్పీకింగ్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్, మాట్రీ మోని, ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ, బ్యాంకు లోన్స్ తదితరు కంపెనీలలో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారు. హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, బెంగాలీ భాషలలో అనర్గళంగా మాట్లాడుతూ ఆధార్‌కార్డు, పాన్ కార్డు అడ్రస్‌లు మార్చి నిందితులు మోసాలకు పాల్పడుతూ సుమారు రూ.1కోటి 34లక్షలు వసూలు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని గురువారం సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇలాంటి మోసాలు చేసే వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో మక్కలకు మంచి ధర

గరిష్ఠంగా క్వింటాకు రూ.2,821

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మొక్కజొన్నలకు మంచి ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్ చరిత్రలోనే పలకని గరిష్ఠ ధర క్వింటాకు రూ.2,821 పలికింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన చిలుముల మొగిలి 33 బస్తాల మొక్కజొన్నలను మార్కెట్‌కు అమ్మకానికి తీసుకువచ్చాడు. మాధవి ట్రేడర్స్ అడ్తి ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు క్వింటాకు రూ.2,821 చొప్పున ఖరీదు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు చిలుముల మొగిలి మాట్లాడుతూ మార్కెట్‌లో మక్కలకు ఆశించిన ధర పలికినందుకు సంతోషంగా ఉందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించినందుకు గిట్టుబాటు ధర పలికితే యువకులందరు ఉద్యోగాల కోసం పరుగులు తీయాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి భూమిలో వారు వ్యవసాయం చేసుకుంటే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువే సంపాదించవచ్చని అన్నారు.

సబ్‌స్టేషన్‌లను ప్రొటెక్షన్ టీమ్‌లు తనిఖీ చేయాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 22: ప్రొటెక్షన్ టీమ్‌లు నిత్యం సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్ఈలు, యంఆర్‌టీ, టెక్నికల్ డీఈలతో గురువారం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి సీఎండీ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ ఉండాలని సూచించారు. సర్వీసులను డిజిటలైజేషన్ చేయాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. లోడ్ ఎక్కువ ఉన్న చోట కెపాసిటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో సిబ్బంది నైపుణ్యత పెంచడానికి శిక్షణ తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఆ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ అశోక్‌కుమార్, మధుసూదన్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరించి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు

ఆలస్యంగా వెలుగులోకి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం



రాంనగర్, ఆగస్టు 22: ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను అడ్డుకోవడం సాధ్యం కాదనే ఆరోపణలున్నాయి. అస్సలు రిజిస్ట్రేషన్‌ల విషయంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు గత ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. నాన్ లేఅవుట్ ప్లాట్లు, పార్ట్, అనుమతులు లేని ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు చేయకూడదనే నిబంధనలు పొందుపరిచింది. ఈ నిబంధనలను బుట్టదాఖలు చేసిన పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్‌లు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలు విస్మరించి రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు డబ్బులు దండుకుంటూ మహబూబాబాద్, పరకాల సబ్ రిజిస్ట్రార్‌లు ఏసీబీకి అడ్డంగా దొరికిన సంఘటనలు సైతం ఉన్నాయి.

కాగా, ఈ సంఘటనలు జరుగుతుండగానే ఖిలా వరంగల్, వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలు విస్మరించి పలు రిజిస్ట్రేషన్‌లు చేసి అందినంత దండుకున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు పదుల సంఖ్యలో నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఖిలావరంగల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని బొల్లికుంటలో వెలిసిన ఒక నాన్ లేఅవుట్ వెంచర్‌కు సంబంధించిన 40కి పైగా రిజిస్ట్రేషన్‌లు కిందటేడు నెలాఖరున జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఒకే రోజున జరిగినవి కాగా, మిగతా రోజుల్లో చాలానే జరిగినట్లు సమాచారం. సదరు సబ్ రిజిస్ట్రార్ గజానికి రూ.200 చొప్పున డబ్బులు దండుకుని నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఇక వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ గొర్రెకుంటకు చెందిన నాన్ లేఅవుట్ 30కి పైగా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం. మూడు మాసాల్లో ఈ రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లకు సైతం సదరు సబ్ రిజిస్ట్రార్ గజాల లెక్కన వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఇద్దరు వసూలు చేసిన మొత్తం లక్షల్లో ఉంటుందనే ప్రచారం సాగుతోంది. వీరిద్దరు ప్రస్తుతం పొరుగు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులపై గతంలో సైతం పలు ఆరోపణలున్నాయి. మొత్తంగా జిల్లాను వీడిన వీరి బాగోతంపై ఉన్నతాధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.


కురవి మండల కేంద్రంలో లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


డోర్నకల్ గాంధీసెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నర్సింహులపేట మండల కేంద్రంలో లో ఆందోళన చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు


మరిపెడలో జాతీయ రహదారిపై నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీమంత్రి రెడ్యానాయక్

రైతు ద్రోహి కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయని కాంగ్రెస్ రైతు ద్రోహి ప్రభుత్వమని మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం చేపట్టిన రైతు రుణమాఫీ చేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతు రుణమాఫీ అమలు కోసం రూ.45 వేల కోట్లు ఖర్చు అవుతుంటే.. క్యాబినెట్ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.31 వేల కోట్లు మాత్రమే అనుమతి తీసుకుని రాష్ట్ర బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే నిధులు కేటాయించారని, వాటితో పూర్తిస్థాయిలో ఎలా రుణమాఫీ చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.17.50 కోట్లు రుణమాఫీ చేశారని, ఇంకా అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగలేదని చెప్పారు. భేషరతుగా ఏకకాలంలో రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అఖిల పక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి నిబంధనలు, జీవోలను సడలించి రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలోచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

రైతులకు సీఎం క్షమాపణలు చెప్పాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత

రాష్ట్రంలో రైతులందరికి సకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 లక్షల మంది రైతులు రుణాలు తీసుకుంటే కేవలం 20 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసి రైతులందరికి రుణమాఫీ చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో గిరిజనులు, దళితులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్నారని, వారందరికి ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ అమలు కానీ హామీలతో ప్రజలందరిని మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందించారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి,


గార్లలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


బయ్యారంలో పాల్గొన్న మాజీఎమ్మెల్యే హరిప్రియనాయక్

బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మర్రి రంగారావు, యాకూబ్ రెడ్డి, రంజిత్, తేళ్ల శ్రీను, చిట్యాల జనార్ధన్, గోగుల రాజు, లూనావత్ అశోక్‌నాయక్, జెరిపోతుల వెం కన్న, బూర్ల ప్రభాకర్‌గౌడ్, అవుల వెంకన్న, రావుల శ్రీనాథ్‌రెడ్డి, మార్నేని రఘు, కిషన్‌నాయక్, సుధాకర్, ఆరె వీరన్న, బోడ లక్ష్మణ్‌నాయక్, నిలేష్‌రాయ్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

చిన్నగూడూరు దాశరథి సెంటర్‌లో రైతులందరికి రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు రాంసింగ్, దారాసింగ్, కొమురెల్లి, సురేష్ పాల్గొన్నారు.

● మరిపెడలో మాజీమంత్రి డీఎస్.రెడ్యానాయక్ నేతృత్వంలో విశ్రాంతిభవనం ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు, నాయకులు గుగులోతు వెంకన్న, సింధూరకుమారి, బాల్ని మాణిక్యం, రవీందర్‌నాయక్, రాంబాబునాయక్, గంధసిరి కృష్ణ, ఉప్పల నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, అబ్దుల్ మజీద్, బాలాజీ, దుస్స నర్సయ్య, హరినాయక్, భూక్య వెంకన్న పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నర్సింహులపేట స్థానిక అంబేద్కర్ సెంటర్ రాస్తారోకో నిర్వహించి రైతు వేదిక, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. మండల అధ్యక్షుడు దేవేందర్, బండి రమేష్, వైస్ ఎంపీపీ దేవేందర్, బండ బిక్షంరెడ్డి, సత్తిరెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

● దంతాలపల్లిలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వలాద్రి ఉమా మల్లారెడ్డి, నాయకులు కిశోర్, సోమేశ్వర్‌లు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించిన నిరసన వ్యక్తం చేశారు.

● డోర్నకల్ గాంధీసెంటర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, మానుకోట ఏఎంసీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, తేజావత్ రమేష్, యశోదర్‌జైన్, అజిత్ మియా, పాండునాయక్, రహీం, వీరయ్య, కొత్త వీరన్న, పోటు జనార్ధన్ పాల్గొన్నారు.

● కురవి జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, బజ్జూరి పిచ్చిరెడ్డి, దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, నూతక్కినర్సింహారావు, నామ సైదులు, గుగులోతు రవినాయక్, జి.రాంచంద్రయ్య, బాదెనాగయ్య, అర్జున్‌చౌహాన్, సంగెం భరత్, సీహెచ్.భాస్కర్, ఆమెడ మల్లికార్జున్, గాడిపల్లి రాములు, పేర్ల గణేష్ పాల్గొన్నారు.

● గార్ల నెహ్రూసెంటర్‌లో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యం రాస్తారోకో నిర్వహించారు. గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, చిట్టిబాబు, తాళ్లూరి శ్రీను, షఫీయొద్దీన్ పాల్గొన్నారు.

● బయ్యారంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నేతలు ధర్నా చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్, మండల అధ్యక్షుడు గణేష్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, వీరభద్రం, శ్రీను, దేవోజీ పాల్గొన్నారు.

రుణమాఫీ మోసంపై బీఆర్ఎస్ రణం

● మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు, ఆగస్టు 22 : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీని చేయాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తొర్రూరులో నిర్వహిం చిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ ఎగ్గొట్టి రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. రుణమాఫీ మొత్తానికి రూ.49,500 కోట్లు అవసరమని చెప్పి.. మాట మార్చి రూ.31 వేలకోట్లు సరిపోతాయని బడ్జెట్‌లో కేటాయించి మూడువిడతల వారీగా రూ.17 వేల కోట్లు రుణమాఫీ చేసి, చేతులు దులుపుకుందన్నారు. రైతుల జాబితా ప్రభుత్వం వద్ద ఉందని, చేతగాని తనం వల్లే రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఎన్నో వాయిదాలు పెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ ఒత్తిడి మేరకు కొంత మేరకే రుణమాఫీ చేసిందన్నారు. వెంటనే రాష్ట్రంలో ఉన్న మిగితా రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాక ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, వారు పిలుపునిచ్చిన ధర్నాకు తాను మద్దతు ఉంటానన్నారు. తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో ఎన్నికల ముందు రూ.35కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తే ప్రస్తుత ఎమ్మెల్యే తిరిగి మళ్లీ కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాకతీయ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌లతో మాట్లాడి రైతులకు ఎంత మేర రుణమాఫీ అయిందో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మంగళపల్లి శ్రీనివాస్, తూర్పాటి అంజయ్య, రామిని శ్రీనివాస్, ఐలయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఉన్నత విద్యనభ్యసించేందుకు ఎన్ఎంఎంఎస్ ఓ వరం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22 : ఉన్నత విద్యనభ్యసించేందుకు నేషనల్ మీన్స్‌కంమెరిట్ స్కాలర్‌షిప్ ఓవరమని స్ఫూర్తి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం స్ఫూర్తి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ తెలుగు సేవా సమితి ఆఫ్ నెబ్రస్కా ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షల బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షల పుస్తకాలు అందించటం ద్వారా పోటీ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు ఏటా రూ. 12 వేలు స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం పీటర్ ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు ఆకుల శ్రీకాంత్, పీఎస్ హెచ్‌ఎం గోవర్ధన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామ్మోహన్, స్వప్న, కోటయ్య, ఓం ప్రకాష్, వెంకటేశ్వర్లు, చాంప్లా, శ్రీదేవి పాల్గొన్నారు.

రాజేందర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలి


పీడీ రాజేందర్‌ను సన్మానిస్తున్న పెటా జిల్లా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు

కేసముద్రం, ఆగస్టు 22 : గ్రామీణ ప్రాంతం నుంచి ఒలంపిక్స్ స్థాయికి వెళ్లిన కేసముద్రం స్టేషన్ హైస్కూల్ పీడీ కొమ్ము రాజేందర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పారీస్‌లో నిర్వహించే పారా ఒలంపిక్స్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా రాజేందర్ వెళుతున్న సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (పెటా) ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సంజీవరెడ్డి మాట్లాడుతూ నెక్కొండకు చెందిన రాజేందర్ పీడీగా పని చేస్తూ రెండుసార్లు ప్రంపచ బ్యాడ్మింటన్ పోటీలకు, ఏషియన్ గేమ్స్, పలు అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో ఎంపైర్‌గా వ్యవహరించడం అభినందనీయమని అన్నారు. హెచ్‌ఎం నరేందర్, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి జ్యోతి, పెటా కార్యదర్శి డి.విజయచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐలయ్య, పీఎస్ హెచ్‌ఎం కళ్లెం వీరారెడ్డి, పీడీ శంకర్, గండి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘డీసీఈబీ నిధులను అడిట్ చేయాలి’

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22 : మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ (డీసీఈబీ)కి మంజూరైన నిధులను ఆడిట్ చేయించాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఈవో రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు పరీక్ష పత్రాలు తయారు చేసి సరఫరా చేయడానికి డీసీఈబీ ఫీజులను సుమారుగా రూ. 23 నుంచి రూ.25 లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ వసూలు చేసిన ఫీజులకు సంబంధించిన డబ్బులను పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులకు తెలుపాల్సి ఉందన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 22 : జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి గురువారం నిత్యావసర వస్తువులు, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత పారిశుధ్య కార్మికులకు విధుల్లో భాగంగా దుస్తులు, నిత్యావసర వస్తువలను అందించినట్లు చెప్పారు. కార్మికులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా చెత్తచెదారం పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, కౌన్సిలర్ సలీం, మేనేజర్ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, లత, సిబ్బంది పాల్గొన్నారు.

మరిపెడలో సోయబ్ ఉల్లాఖాన్ వర్ధంతి

మరిపెడ, ఆగస్టు 22 : సోయబ్ ఉల్లాఖాన్ వర్ధంతి వేడుకలను మరిపెడ జర్నలిస్టులు గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి భవన్‌లో నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూల మాలలేసి నివాళులర్పించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతలు గంధసిరి రవి, షేక్ సత్తార్‌పాష మాట్లాడతూ నేటి జర్నలిస్టులు సోయబ్ ఉల్లాఖాన్ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని జర్నలిస్ట్ సమస్యలపై ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, వేణు, శ్రీనివాస్, రాజేశ్, గోవర్ధన్, బోడ శ్రీను, ఉపేంద్రాచారి, నాగేందర్, బోడ పట్ల వెంకన్న, సతీశ్, తిరుమల్, సంజీవ్, అక్తర్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మహేందర్, నాగరాజు, శ్రీకుమార్, మూడవత్ రవి, ఉపేందర్, దేవరశెట్టి శ్రీశైలం, ప్రవీణ్ పాల్గొన్నారు.

‘సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలి’

తొర్రూరు రూరల్, ఆగస్టు 22 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండాలని డాక్టర్ కోట నరేష్ అన్నారు. గురువారం గోపాలగిరిలో జనవికాస ఆధ్వర్యంలో మెడికేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనవికాస మేనేజర్ రమ, ప్రతినిధులు శైలజ, శోభారాణి, కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.రోగులకు మందులను పంపిణీ చేశారు.

వ్యవసాయ అధికారిగా భాస్కర్ బాధ్యతల స్వీకరణ



చిన్నగూడూరు, ఆగస్టు 22 : మండల వ్యవసాయ అధికారిగా బాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ తనవంతు సహాయ సహకారం అందిస్తానని అన్నారు. రుణమాఫీ కాని మండల రైతులందరూ తమ వివరాలను ఉగ్గంపల్లి రైతు వేదికలో ఉన్న అధికారులకు అందజేయాలని సూచించారు.

‘ఓబీసీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి’

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 22 : హైదరాబాద్‌లో ఈనెల 25 నిర్వహించే ఓబీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐఎల్‌పీఏ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం దేవరాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో గురువారం రాష్ట్ర సదస్సు విజయవంతం కోసం ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయసమరంలో బహుజన న్యాయవాదులను భాగస్వాములను చేసి సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో జనాభా దమాషా ప్రకారం వాటా సాధన కోసం పోరాడాలన్నారు. బీసీ సమాజం ఐక్యంగా సాగి చట్ట సభల్లో, న్యాయ వ్యవస్థల్లో వారివారి వాటాను దక్కించుకోవాలన్నారు. న్యాయవాదులు కొంపెల్లి వెంకటయ్య, మాధవ కృష్ణ, సాయిని నరేందర్, నరహరి, మామిడాల సత్యనారాయణ, దాసరి నాగేశ్వర్‌రావు, పుల్లూరి కృష్ణయ్య, ఆనంద్‌కుమార్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, జయపాల్, గౌస్, మందుల శ్రీనివాస్, సునీత, జయకృష్ణ పాల్గొన్నారు.

● తొర్రూరు : ఓబీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎల్‌పీఏ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం దేవరాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే ఓబీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సమాజాన్ని చైతన్యం చేసి హక్కుల సాధన కోసం దేశంలోనే మొట్టమొదటి సారిగా జరుగుతున్న ఓబీసీ న్యాయవాదుల సదస్సుకు పెద్ద ఎత్తున హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రవీణ్ రాజు, కార్యదర్శి రామకృష్ణ, న్యాయవాదులు సైదులు, బి.వెంకన్న, మహేష్, రఘురామ్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌చందర్, లాలు, నగేష్, శ్రీనివాస్, విజయ, పల్లవి ఉన్నారు.


మానుకోట జిల్లా కోర్టు ఆవరణలో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎల్‌పీఏ రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజ్‌గౌడ్

రాజకీయ లబ్ధికోసమే రుణమాఫీ ధర్నాలు : కాంగ్రెస్


మాట్లాడుతున్న ముద్దసాని సురేష్

పెద్దవంగర, ఆగస్టు 22 : రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీపై ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకుడు బొమ్మరబోయిన రాజుయాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలు ప్రజావ్యతిరేక, నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడి ప్రజాపాలన కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దేశచరిత్రలోనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేశారని తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి సతీష్, ముత్తినేని శ్రీనివాస్, గోపాల్‌నాయక్, బానోతు వెంకన్న, దాసరి శ్రీనివాస్, సోమన్న, బోనగిరి లింగమూర్తి, హరికృష్ణ, పన్నీరు వేణు, రాంబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి పట్ల రాజన్న కృషి చిరస్మరణీయం

● సంతాప సభలో ఉపాధ్యాయ సంఘ నేతలు

బయ్యారం, ఆగస్టు 22 : ఇటీవల హఠాన్మరణం గావించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగావత్ రాజన్న విద్యాభివృద్ధి కోసం చేసిన కృషి చిరస్మరణీయమని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరునాయక్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు భద్రు నాయక్, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రవీందర్‌నాయక్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు బిచ్చ నాయక్‌లు అన్నారు. గురువారం సింగారం గ్రామంలో రాజన్న సంతాప సభ జరిగింది. ఈ సంతాప సభకు హాజరైన ఉపాధ్యాయ సంఘ నేతలు రాజన్న చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వపరంగా అందాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందించేలా కృషి చేస్తామని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, వీరన్న, వెంకటేశ్వర్లు, శంకర్, బాలాజీ, నాగేశ్వరరావు, మోహన్, లక్ష్మీనారాయణ, స్వాతి, పార్వతి, మహేశ్వరీ పాల్గొన్నారు.

తాళ్లూరి బాబుకు ఘన నివాళి

డోర్నకల్, ఆగస్టు 22 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తాళ్లూరి బాబు వర్ధంతిని అభిమానులు, కుటుంబసభ్యులు గురువారం నిర్వహించారు. ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న తాళ్లూరి బాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా డోర్నకల్ మునిసిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం, మాజీ సర్పంచ్ గుండ్రాల భాస్కర్ మాట్లాడుతూ తాళ్లూరి బాబు తమలాంటి ఎందరో నాయకులకు రాజకీయంగా గుర్తింపు తీసుకువచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి బాబు కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.


‘విదార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి’

డోర్నకల్, ఆగస్టు 22 : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించినప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని డోర్నకల్ మునిసిపల్ 8వ వార్డు కౌన్సిలర్ శీలం భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాస్, మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ పాల్గొన్నారు.

‘అభివృద్ధి నిధులపై విచారణ జరపాలి’

గార్ల, ఆగస్టు 22 : గార్ల శ్రీవేట వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి నిధులపై దేవాదాయ శాఖ అధికారులు విచారణ జరిపి, వాటికి సంబంధించి భక్తులకు బహిర్గతం చేయాలని బంజార యువజన సంఘం మండల అధ్యక్షుడు భూక్యా హరినాయక్ డిమాండ్ చేశారు. గురువారం వేట వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా భక్తులు సమర్పించే విరాళాలను వస్తురూపంలోను, నగదు రూపంలో వచ్చిన వాటికి కొందరు ఆలయ కమిటీతో పాటు అధికారులు తప్పుడు లెక్కలు చూపుతూ నిధులను పక్కదారి పట్టించడం జరుగుతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో బానోత్ మల్లిబాబునాయక్ పాల్గొన్నారు.

‘పోరాట పటిమను అలవర్చుకోవాలి’


ప్రసంగిస్తున్న న్యూడెమోక్రసీ జాతీయ నాయకుడు వెంకట్రామయ్య

గార్ల, ఆగస్టు 22 : విప్లవోద్యమంలో పనిచేస్తున్న యువత సైద్ధాంతిక పోరాట వారసత్వ పటిమను అలవర్చుకోవాలని న్యూ డెమోక్రసీ జాతీయ నాయకుడు వేములపల్లి వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. గురువారం గార్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో పీవైఎల్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించి, ఆయన ప్రసంగించారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేసే కార్యకర్తలు విలువలతో కూడిన రాజకీయాలను ముందు వరసలో ఉండి, నడిపిస్తారని వివరించారు. పీవైఎల్ కార్యకర్తలు జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అవునూరి మధు, జి.సక్రు, గణేష్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మండల కమిటీ నియామకం

గార్ల, ఆగస్టు 22 : మండల సేవాలాల్‌సేన మండల అధ్యక్షుడితో పాటు మరో 20మందితో నూతన కమిటీని గురువారం ప్రకటించి విడుదల చేశారు. అధ్యక్షుడిగా గుగులోత్ సాయికుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా ధరవత్ వెంకన్నతో పాటు మరో 20మందితో కమిటీని నియమించారు. ఈసందర్భంగా సాయికుమార్ మాట్లాడారు. సందర్భంగా జాతీయ అధ్యక్షుడు సంజీవ్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


ముస్మీలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఎన్డీ నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

కొత్తగూడ, ఆగస్టు 22 : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగ శిక్షించాలని డిమాండ్ చేస్తు మండలంలోని ముస్మీ, కర్లైగండి, లడాయిగడ్డలో బుధవారం రాత్రి సీపీఐ (ఎంఎల్) ఎన్డీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు పసునూరి రాజమల్లు, ఎన్డీ నాయకులు భూక్య రాంసింగ్, పిట్టల దేవేందర్, రాసమళ్ల శ్రీను, ఈసం రామస్వామి, రవి, మద్దెల వెంకటేష్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను అమలు చేయాలి

● తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి

కొత్తగూడ, ఆగస్టు 22 : ఆదివాసీల హక్కులు, చట్టాలు అమలు చేయాలని, ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి పిలుపునిచ్చారు. కొత్తగూడలో గురువారం నిర్వహించిన సమావేశంలో రవి మాట్లాడారు. షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీ హక్కులు, చట్టాలు అమలు చేసి విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఆదివాసీలను అభివృద్ధి పరచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. 2024 డీఎస్సీని ప్రకటించాలని, జీవో 3ను అనుసరించి రిక్రూట్‌మెంట్ జరపాలని డిమాండ్ చేశారు. ట్రైబల్ అడ్వయిజర్ కమిటీని నియమించాలన్నారు. లేకుంటే పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిద్ధబోయిన సంజీవ, అల్లెం జంపయ్య, కుంజ నర్సింగరావు, మల్లెల సందీప్, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, పవన్, మునేష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 22 : జిల్లాలో గురువారం ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని జానపద కళాకారులు జిల్లా పౌరసంబంధాల కార్యాలయంలో డీపీఆర్వో రాజేంద్ర ప్రసాద్‌కు పుష్పగుచ్చం అందించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జానపద కళలు ప్రజల చేత ఆదరించబడినంత వరకు సజీవంగా, శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్కెర నాగేంద్రాచారి, గంగుల శ్రీనివాస్, కృష్ణమూర్తి, అంతయ్య, సత్యనారాయణ, సాయిలు, వెంకట్‌రెడ్డి, బండపల్లి వెంకన్న, నాగయ్య, పాపయ్య స్వామి, సురేష్ పాల్గొన్నారు.